నేటి నుంచి ఉగాది నాటకోత్సవాలు

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో 5 రోజుల పాటు ఉగాది నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. నేటి నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు నాటకాల ప్రదర్శన ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కాని నర్సింహులు అన్నారు. జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహులు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మంత్రిని అడిగిన వెంటనే అర్చకులకు జీతాలు

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పండుగ వేళ ఇంకా వేతనాలు రాలేదంటూ పలువురు అర్చకులు మంత్రి కొండా సురేఖకు చెప్పడంతో వెంటనే ఆమె దేవాదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి రాష్ట్రంలోని అర్చకులందరికీ వేతనాలు వేయించారు. శనివారం మత్రైక అర్చక ఉద్యోగ సంఘం ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరగా దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే జీతాలు జమయ్యేలా చేశారు.

అంబేడ్కర్ వర్సిటీలో ఇఫ్తార్

హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి: డా.బీ.ఆర్ అంబేడ్కర్ వర్సిటీలో వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మద్యం తాగి ట్యాంకర్ నడిపితే యజమానిపైనా కేసు

● ట్రాఫిక్ సీఐ సైదులు

అమీర్‌పేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నీటి ట్యాంకర్లు భారీ వాహనాలు కావడంతో డ్రైవర్లు మద్యం తాగి వాహనం నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశలు ఎక్కువని, గతంలో చాలా మరణాలు సంభవించాయని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. ట్యాంకర్ల డ్రైవర్లపై నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే వారితో పాటు ట్యాంకర్ల యజమనులపై సైతం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శనివారం అమీర్‌పేటలో నిర్వహించిన తనిఖీల్లో మూసాపేటకు చెందిన ఓ ట్యాంకర్ డ్రైవర్ మద్యం తాగినట్లు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. నీటి ట్యాంకర్ల యజమానులు తమ వాహనాలను ఇచ్చే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.







గంజాయి వినియోగదారుడి అరెస్ట్

బోరబండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్‌లోని ఓ పాన్ షాప్ వద్ద గంజాయి వినియోగిస్తున్న టి.అంజయ్యనగర్‌కు చెందిన పటాన్ సమీర్(24)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి జేబులో ఒక గ్రాము గంజాయి దొరికింది. బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థలం ఆక్రమణ కేసులో ఐదుగురిపై కేసు నమోదు

బోరబండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు ఓ మహిళకు చెందిన స్థలం ఆక్రమణ కేసులో బోరబండ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. బాధితురాలు లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్ హిల్స్ మహాత్మానగర్‌లో తన స్థలంలో గుడిసెను తొలగించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సివిల్ కేసు అయినందున ఫిర్యాదును స్వీకరించకపోవడంతో లక్ష్మి కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు మహాత్మానగర్ బస్తీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ వెంకటయ్య, వెంకటస్వామి, కురుమయ్య, అలివేలుపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉగాది పచ్చడి పంపిణీ

బోరబండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకొని రహ్మత్ నగర్ అమూల్ బేకరీ వీధిలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నారు. స్థానికులు తరలివచ్చి పచ్చడిని స్వీకరించాలని స్థానిక ప్రతినిధి రవీందర్ కోరారు.

డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపివేయాలి

పంజాగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, మరో 25 ఏళ్ల పాటు ఈ ప్రక్రియను నిలిపివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రం యూనిట్‌గా ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాల్లో 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలని కేంద్రానికి సూచించారు.









బాధితురాలిని పరామర్శించిన కిషన్‌రెడ్డి



బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు అత్యాచార యత్నం ఘటనలో గాయపడి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతపురం ఉరవకొండకు చెందిన యువతి ఈ ఘటనలో గాయపడిందని, దాడి జరిగిన విషయం తెలుసుకొని బీజేపీ మహిళా మోర్చా బాధితరాలిని యశోద ఆస్పత్రిలో చేర్పించినట్టు చెప్పారు. ఆమెకు ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ నిర్వహించారని ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అమ్మాయి వైద్య ఖర్చులన్నీ తామే భరిస్తాం.. అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నియోజవర్గానికి చెందిన యువతి కావడంతో అక్కడి మంత్రితో మాట్లాడినట్టు చెప్పారు. ఈ ఘటనలో కొందరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని, రైల్వే లా అండ్ ఆర్డర్ డీజీతో కూడా మాట్లాడామని, యువతి స్టేట్మెంట్ తీసుకుని పోలీసులు తర్వాత విచరణ చేస్తారని చెప్పారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 60మంది లబ్ధిదారులకు సుమారు రూ. 25 లక్షల విలువచేసే సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, లక్ష్మీప్రసన్న, నాయకులు కరాటేరాజు, శేఖర్, ఎల్.శ్రీనివాస్, శ్రీకాంత్, బెజ్జంకి రాజేష్, సునీల్ ముదిరాజ్, అశ్విన్, మేడిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

\- బౌద్ధనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేసి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంపై తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్, అండ్ కంప్యూటర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, అసోసియేషన్ ప్రతినిధులు ఫణి, వివేక్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, మార్చి 29 (ఆంధ్రజ్యోతి)

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ పని ఖతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, తిరుమలగిరి మార్చి 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ పని ఖతమైపోయిందని, బోర్డు పాలక మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొద్దో గొప్పో పోటీ ఇచ్చేది బీజేపీ మాత్రమేనని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. బోర్డు పాలక మండలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, అన్ని వార్డుల్లో గెలుపు కోసం కసరత్తు చేస్తున్నామని తెలిపారు. జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా శనివారం కంటోన్మెంటులోని తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్‌లో నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత సమక్షంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. బోర్డు ఎన్నికల్లో ఆయా వార్డుల నుంచి అభ్యర్థులుగా ఎవరిని బరిలోకి దింపినా గెలిచేలా ఉండాలంటే, నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌కుమార్‌గౌడ్, పెద్దాల నర్సింహయాదవ్, ఖదీరవన్ రాజగోపాల్, బద్రీనాద్‌యాదవ్, సంతోష్‌యాదవ్, సరిత, మురళిముదిరాజ్, రేపాల వెంకటేశ్వరు, ముప్పిడి మధుకర్, శ్యాంసన్‌రాజు, మైసాని శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం హుస్సేన్ సాగర్ పక్కన ఉన్న యూత్ హాస్టల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ సంబరాల్లో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ వలంటీర్ అనిల్ కుమార్, అప్సా ఇన్‌చార్జి బసవరాజ్, మహిళా మండలి అధ్యక్షురాలు లావణ్య, అంగన్‌వాడీ టీచర్ సరిత, మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

\- రాంగోపాల్‌పేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి)

తార్నాకలో చలివేంద్రం ఏర్పాటు



ప్రఫుల్లా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తార్నాకలో ఏర్పాటు చేసిన చలివేంద్రం సెంటర్‌ను శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా. లక్కరాజు నిర్మల ప్రారంభించారు. కార్యక్రమంలో డా. నిర్మాల నరసింహ్మారావు, ఓం ప్రకాష్, నడిగుంటి చంద్రం, కావలి రమ, బెల్లం వాణి, లత పణిభూషణ్ పాల్గొన్నారు.

\- తార్నాక, మార్చి 29(ఆంధ్రజ్యోతి)



నామాలగుండు చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నందమూరి రామకృష్ణ, శ్రీనివాస్‌కుమార్ తదితరులు



అడ్డగుట్టలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

బౌద్ధనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన పార్టీ తెలుగు దేశం పార్టీయేనని స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. శనివారం నామాలగుండు చౌరస్తాలో సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయనతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతో అన్నివర్గాల ప్రజలకు సమాన న్యాయం చేకూరిందన్నారు. టీడీపీలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రాంతాలు వేరైనా తెలుగువారి అంతరంగం ఒక్కటేనని చాటి చెప్పిన గొప్పవ్యక్తి ఎన్టీఆరేనని అన్నారు. శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. టీడీపీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వారి సహకారంతో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. నాయకులు పరిటాల విజయకుమార్, రమేష్‌బాబు, నాగమల్లేశ్వరి, చిరంజీవిరాజు, శశిరేఖ, మంద వెంకటస్వామి, చంద్రమోహన్, మురళి, రాహుల్, పూజ పాల్గొన్నారు.

అడ్డగుట్ట: టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు చందర్‌ముదిరాజ్, టీడీపీ నాయకులు నగేష్, నరసింహ, నటరాజ్, బాలరాజు, బాలయ్య, భారతమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.



చొప్పదండి నియోజకవర్గం టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడపల్లి హరీష్‌తో పాటు, టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ మాణికేశ్వర్ నగర్ చౌరాస్తాలో టీడీపీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు.

\- తార్నాక, మార్చి 29(ఆంధ్రజ్యోతి)



టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకుడు గౌరిశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో మోండా డివిజన్‌లో టీడీపీ జెండా ఎగురవేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వినోద్, నాందేవ్, శ్రీధర్, ఆనంద్ రావు, నర్సింగరావు, దత్తాత్రేయ, కేఆర్ రమేష్, బాబు, రాజు, చారి, నర్సింగరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

\- రెజిమెంటల్‌బజార్, మార్చి 29(ఆంధ్రజ్యోతి)

రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరిద్దాం



సమావేశంలో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు

బౌద్ధనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తప్పుదోవ పట్టించటానికి ప్రయత్నిస్తోందని, రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరిద్దామని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్, జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ఇన్‌చార్జి కాల్వ సుజాత అన్నారు. నామాలగుండు బీఎన్ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాత, ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాపాడానికి, పోరాడటానికి ప్రతిజ్ఞ చేయడం తప్పనిసరన్నారు. రాజ్యాంగాన్ని, భారత స్వాతంత్ర్య ఉద్యమ ఆదర్శాలను రక్షించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, పీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమం సంవత్సరం పాటు కొనసాగుతుందని తెలిపారు. నాయకులు జలంధర్‌రెడ్డి, అమర్‌నాధ్‌గౌడ్, అభిషేక్, అనిల్‌కుమార్, శిల్పాచారి, గంటరాజు, షకీల్‌ఖాన్, మహ్మద్ వహిదుద్దీన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్యసేవలను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్

బోయినపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఉచిత వైద్యసేవలను వినియోగించుకొని డాక్టర్ల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కంటోన్మెంట్ బోర్డు సివిలియం నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ అన్నారు. మాక్స్ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం బోయినపల్లి 1వ వార్డులో సంచారపురి కాలనీ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానికంగా పర్యటించి కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 1వ వార్డు అధ్యక్షుడు జైపాల్ రాకేష్‌సింగ్, కాలనీవాసులు సురేంద్ర రెడ్డి, మూర్తి, తిలక్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

తిరుమలగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంటు బోర్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని కంటోన్మెంటు బోర్డు నామినెటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంటు బోర్డు పరిధిలోని వార్డు-7 ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన రాష్ట్రీయ సాక్షర మిషన్ క్రింద శనివారం లాల్‌బజార్ బాలికల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేశారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పవన్ కుమార్, ప్రశాంత్, మనోహర్, శ్రీధర్ రెడ్డి, మంజుల, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



బస్తీ వాసులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి

బోయినపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీస్ సిబ్బందితో సమానంగా పనిచేస్తుందని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచారపురి కాలనీలో శనివారం బస్తీవాసులతో బోయిన్‌పల్లి పోలీసులు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన డీఐ సర్దార్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల తోడ్పాటు ఎంతో ముఖ్యమన్నారు. కాలనీలలో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేర రహిత సమాజానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానికులు, వివిధ కాలనీల ప్రతినిధులు, ఎస్ఐ శివశంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన



రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఘాస్మండిలోని ఆదయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఈవ్ టీజింగ్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్‌పై మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కల్పన, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ, తదితర ఉపాధ్యాయులతో పాటు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

\- రాంగోపాల్‌పేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి)

ఐరన్‌పోల్స్ మాయం

బౌద్ధనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులో విలువైన ఐరన్‌పోల్స్ మాయమయ్యాయి. శుక్రవారం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో పార్కులో ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు తాము జీహెచ్ఎంసీ నుంచి వచ్చామని, ఐరన్ పోల్స్ తెమ్మన్నారని అధికారులు ఆదేశించారని వాచ్‌మన్‌కు చెప్పారు. వాచ్‌మన్ రూమ్ నుంచి కరెంట్ తీసుకుని కటింగ్ మిషన్‌తో మూడు ఐరన్‌పోల్స్‌ను కట్ చేసి తమవెంట తీసుకువెళ్లారు. చిలకలగూడ పార్కు వాకర్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు శనివారం ఉదయం పార్కులో చూసేసరికి ఐరన్‌పోల్స్ కనిపించలేదు. వాచ్‌మన్ ఐలయ్యను ప్రశ్నించగా రాత్రి సమయంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పోల్స్‌ను కట్ చేసి తీసుకువెళ్లారని చెప్పాడు. అసోసియేషన్ ప్రతినిధులు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించగా పార్కుల్ ఐరన్‌పోల్స్ మాయం గురించి తమకు తెలియదని, పోల్స్‌ను తొలగించాలని తాము ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని, రాత్రి సమయంలో తమ సిబ్బంది వచ్చే అవకాశమే లేదని స్పష్టం చేశారు. దీంతో సొసైటీ ప్రతినిధులు శనివారం సాయంత్రం చిలకలగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఐరన్ పోల్స్ చోరీ విషయమై ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

'డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు'

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఆధునీకరించి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జా యింట్ కన్వీనర్ నవీన్ గౌడ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌తో కలిసి డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నవీన్‌గౌడ్ మాట్లాడుతూ అధికారులు నిర్మాణ పనులల్లో జాప్యం లేకుండా వెంటనే చేపట్టాలని కోరారు. బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

మారేడుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి సర్వసుఖి కాలనీలోని సీతారామ మందిరంలో ఈనెల 30నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సీతారామ మందిరం టెంపుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఎస్‌హెచ్ నవీన్ బాబు, ఎస్‌కే హరీష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉగాది సందర్భంగా ఆలయంలో స్వామికి అభిషేకం, ప్రార్ధన, కలశస్థాపన, సాయంత్రం 6.30 నిమిషాలకు తిరుగుల దామోదర్ శర్మ సిద్ధాంతి పంచాంగ శ్రవణం వినిపిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు మధ్యా హ్నం పదివేల మంది భక్తులకు అన్న ప్ర సాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 12న హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో..

మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ అరుణ, చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 12న హనుమాన్ జయంతి మహోత్సవం ఉంటుందని తెలిపారు.

మహంకాళి ఆలయంలో

అమావాస్య పూజలు

తిరుమలగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి మహంకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కంటోన్మెంటు బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో యశ్వంత్ కుమార్ పర్యవేక్షణలో, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల పేరు మీద అర్చన చేయించారు. ఆలయం వద్ద ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీ శంకర్, బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, ఎర్రోళ్ల రుక్మయ్య, చిన్నన్న, రాజు, రాజారెడ్డి, ఉమేష్, వేణుగోపాల్, అనురాధ రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో శనివారం అమవ్వాస పూజలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ బాటియా, శ్రీకాంత్, దుర్గయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి మృతదేహాల లభ్యం



సుల్తాన్, నరేష్ మృతదేహాలు

రెజిమెంటల్‌బజార్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై మృతి చెంది ఉన్న ఇద్దరి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ఫుట్‌పాత్‌పైన ఇద్దరు వ్యక్తులు అచేతనంగా పడి ఉన్నారని మార్కెట్ బ్లాకోల్ట్ పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూడగా 65-70సంవత్సరాల వయస్సు ఉండి చేతికి సెప్టిక్ అయి ఒకరు, 50-55సంత్సరాల వయస్సు ఉండి కాలుకు సెప్టిక్ అయి మరొకరు స్పృహ లేకుండా పడి ఉన్నారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతులు యాచిస్తూ జీవించే సుల్తాన్, నరేష్‌గా గుర్తించారు. మృతుల బంధువులు గుర్తిస్తే మార్కెట్ ఎస్సై మమతను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

గాంధీ ఆస్పత్రిలో..



గుర్తు తెలియని మృతదేహం

బౌద్ధనగర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్ప త్రి ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద పడి ఉన్న ఓ గు ర్తు తెలియని మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న గాంధీ ఆస్పత్రిలో గాంధీబొమ్మ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడని 100డయల్‌కు ఫోన్ వచ్చిందని, సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపా రు. మృతుడు వయసు 30-35 సంవత్సరాలు ఉంటాయని, వంటిపై బ్రౌన్ కలర్ షర్ట్, తెలుపు రంగు ప్యాంట్ ఉందని తెలపారు. మృతుడికి సంబంధించిన వారు చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 8లో శుక్రవా రం రైలు వస్తున్న సమయంలో ఒక్కసారిగా షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా దూకి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే సమచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈఘటనలో రెండు కాళ్లు తెగిపోయాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దయానంద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్య



విజేందర్ రెడ్డి (ఫైల్ ఫొటో)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లోని ఓ గదిలో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దయానంద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన ఊరుకొండ విజేందర్ రెడ్డి (39) దయానంద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఎలక్ట్రిషియన్. ప్రతి రోజు ఊరి నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తుండగా శనివారం దయానంద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఉన్న ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్టేషన్ మాస్టర్ సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



సెక్యూరిటీగార్డు సంకేత్ సౌరవ్

అడ్డగుట్ట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో అనుమానాస్పదస్థితిలో సెక్యూరిటీగార్డు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ బెగుసరాయ్ విష్ణాపూర్ రత్నాపూర్ గ్రామానికి చెందిన సంకేత్ సౌరవ్(26)కు భార్య ఇద్దరు పిల్లలు. కొన్ని నెలల క్రితం ఉపాధి కోసం వచ్చి సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులోని అమ్‌స్ట్రీ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ భార్య ఫోన్ చేసి భర్తను బాగోగులు అడిగి తెలుసుకునేది. ఈనెల 17న కూడా భర్తకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ ఉంది. ఈనెల 24న హైదాబాద్‌కు వచ్చిన భార్య పనిచేసే గోల్డర్ సెక్యూరిటీ సర్వీస్ కార్యాలయానికి వెళ్లి భర్త జాడ కోసం నిర్వాహకులను అడుగగా తమకు తెలియదని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వెంటనే బాధితురాలు శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈవ్యక్తి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి..



వర్ష (ఫైల్)

బౌద్ధనగర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ మైలార్‌గడ్డ చెందిన డి.వర్ష(20) సికింద్రాబాద్‌లో ఓ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైంగా మెహింద్ది వర్క్ చేస్తోంది. ఈనెల 24వ తారీఖు సాయంత్రం మెహిదిపట్నంలో గోరింటాకు పెట్టే పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో యువతి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. తండ్రి సంతోష్ శుక్రవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.